

పర్యాటకులు లేక నిర్మానుష్యంగా మారిన తొట్లకొండ

తొట్లకొండపై నిర్లక్ష్యపు నీడ

బౌద్ధ భిక్షువులు నడయాడిన పవిత్ర స్థలం ప్రాభవాన్ని కోల్పోతోంది. అధికారుల నిర్లక్ష్యంతో తొట్లకొండ ప్రాశస్త్యం మసకబారుతోంది. అభివృద్ధి జాడే లేకపోగా.. కనీస సౌకర్యాలైనా కానరావడం లేదు. సేద తీరేందుకు నిలువ నీడ, దాహం తీర్చుకునేందుకు తాగునీరు కూడా లేకపోవడంతో పర్యాటకులు వెనుదిరుగుతున్నారు. పవిత్రమైన స్థలం అసాంఘిక కార్యకలాపాలకు నిలయంగా మారడంతో పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఎండలో ఇబ్బందులు పడుతున్న పర్యాటకులు

- సౌకర్యాలు లేక పర్యాటకుల అవస్థలు
- తాగునీరు, నిలువ నీడైనా లేక వెనుదిరుగుతున్న వైనం
- అసాంఘిక కార్య కలాపాలకు నెలవు
- మసకబారుతున్న ప్రాభవం

కొమ్మాది: భీమిలి బీచ్ రోడ్డు మంగమారిపేటలో సుప్రసిద్ధ బౌద్ధారామం తొట్లకొండపై నిర్లక్ష్యపు నీడలు అలముకున్నాయి. కనీస సౌకర్యాలు లేకపోవడం, కొండపై అసాంఘిక కార్యకలాపాలు సాగించడంతో దేశ, విదేశీయ పర్యాటకులు అసహనంతో వెనుదిరుగుతున్నారు.

చారిత్రక ఆనవాళ్లెన్నో..

చారిత్రక ప్రాధాన్యం గల ఈ కొండపై నాటి బౌద్ధ భిక్షువులు ఏర్పాటు చేసిన రాతి నీటి తొట్టెలు, ఉద్దేశిక స్థూపాలు, మహాస్థూపం, విహారాలు, ప్రధాన బౌద్ధ భిక్షువు గది, గజ పృష్టాకార చైత్య గృహాలు, సమావేశ మందిరాలు, వంటగది (కపియ భూమి), అర్ధ వృత్తాకార చైత్య గృహాలు, బుద్ధ పాద వేదికలు వంటివి ఎన్నో ఈ కొండపై మనం చూడవచ్చు. అటువంటి చరిత్ర గలిగిన ఈ కొండను చూసేందుకు ఉత్తరాంధ్ర నుంచే కాకుండా, దేశ విదేశాల నుండి ఎందరో పర్యాటకులతో పాటు, మహా బౌద్ధ భిక్షువులు పర్యటిస్తుంటారు. అంతటి మహా పవిత్రమైన స్థలాన్ని చూసేందుకు ఎంతో ఆసక్తిగా వస్తున్న పర్యాటకులు ఇక్కడి పరిస్థితి చూసి, నిరాశగా వెనుదిరుగుతున్నారు.



నిర్వహణ లేక పేరుకుపోయిన వ్యర్థాలు

కనీస వసతులేవీ?

కొండపైకి చేరుకున్న తరువాత కుటుంబంతో కలసి ఉందామన్నా, సేద తీరుదామన్నా నిలువు నీడ లేదు. తాగేందుకు నీరు లేదు. ఏమైనా తిందామన్నా, ఒక క్యాంటీన్ కూడా లేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో ఎంతో ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. సరైన రక్షణ కూడా లేకపోవడంతో పర్యాటకులు నానా అవస్థలు ఎదుర్కొంటున్నారు. కొండపైకి తాగునీరు పంపించాలని గతంలో అధికారులు నిర్ణయం తీసుకున్నా, అది కార్యరూపం దాల్చలేదు. ఇక నిర్వహణలోపం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. ఎక్కడ చూసినా ప్లాస్టిక్ వ్యర్థాలు, ఇతర వ్యర్థాలు పేరుకుపోయాయి. ఇప్పటికైనా పురావస్తు శాఖ, పర్యాటక శాఖ సమన్వయంతో ఈ కొండపై మౌలిక సౌకర్యాలు కల్పించాలని, పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయాలని పలువురు పర్యాటకులు కోరుతున్నారు.

కొరవడిన నిఘా

ఎంతో విశిష్ట చరిత్ర కలిగిన ఈ కొండ ప్రస్తుతం అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతోంది. కొందరు కొండపైకి చేరుకుని మద్యం సేవిస్తూ పర్యాటకులను భయభ్రాంతులకు గురి చేస్తున్నారు. వాస్తవానికి కొండపైకి ఆల్కహాల్ అనుమతి లేదు. అయినా మద్యం ఎలా తీసుకుని వస్తున్నారనేది ప్రశ్న. సీసీ కెమెరా వ్యవస్థ లేకపోవడం, పోలీసులు పట్టించుకోకపోవడం దీనికి ప్రధాన కారణాలుగా భావిస్తున్నారు.



కొండపై బీరు బాటిల్స్

ఎండలో సేద తీరుదామన్నా నీడ లేదు

తొట్లకొండ చూసేందుకు నల్గొండ నుంచి కుటుంబంతో వచ్చాం. ఎండ తీవ్రత తట్టుకోలేక సేద తీరుదామన్నా ఎక్కడా నీడ లేదు. తాగేందుకు నీరు లేక చాలా ఇబ్బందులు పడ్డాం. చేసేది లేక వెంటనే వెనుదిరిగాం.

– వెంకటేశ్వరరావు, నల్గొండ

పిల్లలతో చాలా ఇబ్బంది పడ్డాం

కొండపై ఎక్కడా పరిశుభ్రత లేదు. తాగేందుకు నీరు కూడా దొరకలేదు. మరుగుదొడ్లు లేకపోవడంతో పిల్లలతో ఇబ్బందులు పడ్డాం. మౌలిక సదుపాయాలు కల్పించి అభివృద్ధి చేస్తే బాగుంటుంది.

– లక్ష్మి, శ్రీకాకుళం

క్లుప్తంగా

మాస్టర్ ప్లాన్ రోడ్డును పరిశీలించిన కలెక్టర్

మధురవాడ: జీవీఎంసీ 6వ వార్డు బక్కన్నపాలెం పోలీసు బెటాలియన్ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డును కలెక్టర్ హరేందిర ప్రసాద్ శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీస్ బెటాలియన్ నుంచి బక్కన్నపాలెంలో నిర్మాణంలో ఉన్న టిడ్కో హౌసింగ్ కాలనీ మీదుగా పీఎం పాలెం ఆఖరి బస్టాప్ వద్ద మాస్టర్ ప్లాన్ రోడ్డు జంక్షన్‌ని కలిపే విధంగా రోడ్డు విస్తరణ, నిర్మాణం కోసం ఈ రోడ్డును పరిశీలించారు. బక్కన్నపాలెం టిడ్కో హౌసింగ్ కాలనీ వద్ద పీఎం పాలెం–సాయిప్రియ రోడ్డు కలిసే చోట సర్కిల్ నిర్మాణం చేసి, అక్కడి నుంచి కొండను ఆనుకుని ఉన్న కాలనీ మీదుగా ఈ రోడ్డు వెళ్తుంది. అయితే జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు మాత్రం కలెక్టర్ పర్యటన వివరాలు గోప్యంగా ఉంచారు. కార్యక్రమంలో జీవీఎంసీ, వీఎంఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

భారీ అన్న సమారాధన



అన్నప్రసాదం స్వీకరిస్తున్న భక్తులు

పీఎం పాలెం: స్థానిక కార్‌షెడ్ కూడలికి సమీపంలో శ్రీ కాశీ ఉమామహేశ్వర స్వామి ఆలయ వార్షికోత్సవం ముగింపు సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం12 గంటలకు బబ్బేలమ్మ ఆలయ ప్రాంగణంలో భారీ అన్న సమారాధన నిర్వహించారు. పరిసర ప్రాంతాలకు చెందిన సుమారు మూడు వేల మంది భక్తులు అన్న ప్రసాదం స్వీకరించారు. స్థానిక నాయకులు పోతిన శ్రీనివాసరావు, బాలాజీ, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

శిల్పారామంలో రేపటి నుంచి ఉగాది సంబరాలు

పీఎం పాలెం: ఏటా మాదిరిగానే ఆదివారం నుంచి శిల్పారామంలో ఉగాది ఉత్సవాలు నిర్వహిస్తున్నామని స్థానిక ఇన్‌చార్జి పరిపాలన అధికారి రమణ తెలిపారు. ఆదివారం సాయంత్రం 6 గంటలకు జ్యోస్ డాన్స్ అకాడమీ ఆధ్వర్యంలో శాస్త్రీయ, జానపద నృత్యాల ప్రదర్శన ఉంటుందన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి తీవ్ర గాయాలు

భీమునిపట్నం: భీమిలి బీచ్‌రోడ్డులో శుక్రవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒక వ్యక్తి గాయపడ్డారు. విశాఖ అప్పుఘర్‌కు చెందిన సురాడ రాంబాబు(45) ద్విచక్రవాహనంపై విశాఖకు వెళ్తుండగా బీచ్‌రోడ్డులోని కొబ్బరి చెట్ల పార్కు వద్ద ఎదురుగా వస్తున్న మరో ద్విచక్రవాహనం ఢీకొంది. ఈ ఘటనలో రాంబాబు తలకు, కాళ్లకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న పోలీసులు ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి, కేసు దర్యాప్తు చేస్తున్నారు.

పాస్టర్ల నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న పాస్టర్లు

పద్మనాభం: పాస్టర్ పగడాల ప్రవీణ్ మరణంపై న్యాయవిచారణ జరపాలని పాస్టర్లు డిమాండ్ చేశారు. పద్మనాభం మండల కాంప్లెక్స్ ప్రాంగణంలో శుక్రవారం సాయంత్రం నిరసన వ్యక్తం చేశారు. పాస్టర్ ప్రవీణ్ పోస్టర్ పట్టుకుని నినాదాలు చేశారు. కార్యక్రమంలో పాస్టర్లు జాన్ విక్టర్, మోజెస్, డేవిడ్, పద్మకుమార్, డి.అబ్రహం పాల్గొన్నారు.

ముగిసిన లైబ్రేరియన్ల వర్క్‌షాప్

మద్దిలపాలెం: డాక్టర్ వి.ఎస్.కృష్ణా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఐదు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలల లైబ్రేరియన్ల వర్క్‌షాప్ శుక్రవారంతో ముగిసింది. ఈ సందర్భంగా కృష్ణా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.జయ మాట్లాడుతూ వర్క్‌షాప్‌లో లైబ్రేరియన్లకు నేటి ఆధునిక ప్రపంచంలో గ్రంథాలయాల ఉపయోగాల గురించి తెలియజేశామన్నారు. రాష్ట్రం నలుమూలల నుంచి సుమారు 38 మంది వివిధ ప్రభుత్వ కళాశాలలకు చెందిన గ్రంథాలయాధికారులు హాజరయ్యారని చెప్పారు. ఏయూ లైబ్రరీ అండ్ ఇన్‌ఫర్మేషన్ సైన్స్ విభాగాధిపతి ఆచార్య ధనరాజు మాట్లాడుతూ ఆటోమేషన్ ఆవశ్యకత, ప్రస్తుత పోటీ ప్రపంచంలో డిజిటల్ రిసోర్సెస్ వినియోగాన్ని తెలియజేశారు. ఆధునిక డిజిటల్ యుగంలో గ్రంథాలయ పాత్ర గురించి వివరించారు. కార్యక్రమ రిసోర్స్ పర్సన్లు గాంధీనగర్ అహ్మదాబాద్‌కు చెందిన సైంటిస్ట్ హేమ చోలిన్, ఆర్తి సవాలే మాట్లాడుతూ గ్రంథాలయాల డిజిటలైజేషన్‌లో ఉపయోగించే సాఫ్ట్‌వేర్ గురించి పూర్తి స్థాయిలో గ్రంథాలయాధికారులకు అవగాహన కల్పించారు.

వైద్యానికి ఆర్థిక సాయం



మహిళ తండ్రికి రూ. 20 వేలు అందిస్తున్న ఫ్యాబ్ సభ్యులు

భీమునిపట్నం: ప్రమాదానికి గురై నడవలేని స్థితిలో ఉన్న మహిళ చికిత్స కోసం ఫ్రెండ్స్ అసోసియేషన్ ఆఫ్ భీమిలి (ఫ్యాబ్) శుక్రవారం ఆర్థిక సాయం అందించింది. నేరెళ్లవలస కాలనీ వద్ద ఉంటున్న కిరణ్మయి అనే మహిళ గోతిలో పడిపోవడంతో తీవ్రగాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఫ్యాబ్ అధ్యక్షుడు కాళ్ల సన్నీ ఆధ్వర్యంలో సభ్యులు.. మహిళ తండ్రి కాయల ప్రభాకర్‌కు రూ. 20 వేలు అందించారు. కార్యక్రమంలో సభ్యులు ముసునూరి శ్రీనివాస్, గుగ్గిళ్ల సాయి, మారోజు గోపి తదితరులు పాల్గొన్నారు.

30న అష్టలక్ష్మి దేవాలయంలో ఉగాది వేడుకలు

కొమ్మాది: స్థానిక అన్నంరాజునగర్‌లోని శ్రీ అష్ట లక్ష్మీ దేవాలయంలో తెలుగు నూతన సంవత్సరం (ఉగాది)ని పురస్కరించుకుని ఆదివారం ఘనంగా వేడుకలు నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకులు చామర్తి శ్రీధరస్వామి తెలిపారు. ఆ రోజు తెల్లవారు జామున 5 గంటలకు సుప్రభాత సేవ, 7 గంటలకు తోమాల సేవ, అలంకరణ, 8 గంటలకు శ్రీ లక్ష్మీ నారాయణులకు సువర్ణ పుష్పార్చన, 9 గంటలకు భక్తులకు ఉగాది పచ్చడి ప్రసాద వితరణ ఉంటుందని పేర్కొన్నారు. సాయంత్రం 6గంటలకు పంచాంగ శ్రవణం, పలు ఆధ్యాత్మిక, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

తగరపువలస: ఆనందపురం మండలం పెద్దిపాలెం 11 కేవీ ఫీడర్‌లో నిర్వహణ, మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి.శ్రీనివాసరావు తెలిపారు. ఈ కారణంగా చందక, పాడుగుపాలెం, వెంకటాపురం, జగన్నాధపురం, గొట్టిపల్లి, కుసులవాడ ప్రాంతాల గృహ, పారిశ్రామిక అవసరాలకు ఆ సమయంలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ టోర్నీ ప్రారంభం



చిట్టివలస పోలమాంబ, నగరానికి చెందిన ఎస్‌హెచ్‌ఎంఎల్ జట్లు

తగరపువలస: చిట్టివలస బంతాట మైదానంలో మూడు రోజుల పాటు జరగనున్న నమ్మి రాము మెమోరియల్ ఉత్తరాంధ్ర ఫుట్‌బాల్ పోటీలు శుక్రవారం సాయంత్రం ప్రారంభం అయ్యాయి. మొత్తం 8 జట్లు పాల్గొననున్న ఈ టోర్నమెంట్‌లో విన్నర్స్ జట్టుకు రూ.15వేలు, రన్నర్స్‌కు రూ.10వేల నగదు బహుమతి, ఇరు జట్లకు ట్రోఫీ, వ్యక్తిగత బహుమతులు ఇవ్వనున్నారు. మొదటి మ్యాచ్‌లో నగరానికి చెందిన ఎస్ఆర్‌కెఎఫ్‌సీ జట్టు, కొమ్మాదికి చెందిన విజ్ఞాస్ జట్టుపై 3–0 గోల్స్ తేడాతో విజయం సాధించగా.. రెండో మ్యాచ్‌లో చిట్టివలసకు చెందిన పోలమాంబ జట్టు నగరానికి చెందిన ఎస్‌హెచ్‌ఎంఎల్ జట్టుపై 5–3 పెనాల్టీ షూటౌట్‌లో విజయం సాధించింది. శనివారం జరగనున్న మ్యాచ్‌లను ఏపీ ఫుట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు కోటగిరి శ్రీధర్ ప్రారంభించనున్నారు. ఈ టోర్నమెంట్‌లో బోర అచ్చెన్నరెడ్డి, పోలమాంబ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు అక్కరమాని చినబాబు, జామి అప్పలకృష్ణ, పందిరి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

పాక్షికంగా అక్రమ నిర్మాణాల తొలగింపు

సాక్షి ఎఫెక్ట్..

తగరపువలస: ఆనందపురం మండలం వేములవలస కూడలిలోని పాత సినిమాహాలు మార్గంలో అక్రమ నిర్మాణాలను శుక్రవారం పాక్షికంగా తొలగించారు. పదేళ్ల క్రితం జాతీయ రహదారుల విస్తరణ సమయంలో అనకాపల్లి–ఆనందపురం జాతీయరహదారిలో నేషనల్ హైవే స్థలాలు స్వాధీనం చేసుకుని, నష్టపరిహారం ఇచ్చిన సంగతి తెలిసిందే. అప్పట్లో జాతీయరహదారి మార్గం మారిపోవడంతో ఆ స్థలాలు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం ఆ స్థలాలలో పక్కా నిర్మాణాలు జరుగుతుండటంతో ఈ నెల 27న 'యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు' శీర్షికతో సాక్షిలో ప్రచురితమైన వార్తపై నేషనల్ హైవే అథారిటీస్ ఆక్రమణలు తొలగించేందుకు వచ్చింది. అయితే, కూటమి నాయకులు అడ్డు తగలడంతో పాక్షికంగా తొలగించారు.



వేములవలసలో పాక్షికంగా తొలగించిన నిర్మాణాలు

ప్రజలపై విద్యుత్ భారం తగ్గించాలి



చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద బిల్లులు దహనం చేస్తున్న సీపీఎం నాయకులు



మధురవాడ ట్రాన్స్ కో ఈఈ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సీపీఎం నాయకులు

తగరపువలస: విద్యుత్ సంస్కరణలు నిలిపివేయాలని కోరుతూ భీమిలి డివిజన్ సీపీఎం నాయకులు చిట్టివలస విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. విద్యుత్ బిల్లులు దహనం చేసి విద్యుత్ భారాలు తగ్గించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ రాష్ట్రంలో ట్రూ అప్ చార్జీలను ఉప సంహరించుకుని, స్మార్ట్ మీటర్ల బిగింపు వెనక్కు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మరో నాయకుడు రవ్వ నరసింగరావు మాట్లాడుతూ ఒక్కో స్మార్ట్ మీటర్ బిగింపునకు అదాని గ్రూప్ కూటమి ప్రభుత్వానికి రూ.15వేల నుంచి రూ.20వేలు చెల్లిస్తుందన్నారు. ఈ భారాన్ని దఫదఫాలుగా ప్రజలపై మోపేందుకు కూటమి ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు ఎస్.అప్పలనాయుడు, నీలాపు రాము, పల్లా పెంటరాజు, నమ్మి నాయుడు, పాల్గొన్నారు.

మధురవాడలో ధర్నా

మధురవాడ: ప్రజలపై విద్యుత్ భారాన్ని నిరసిస్తూ మధురవాడలోని ఏపీఈపీడీసీఎల్ జోన్–3 ఈఈ కార్యాలయం ఎదుట సీపీఎం మధురవాడ జోన్ నాయకులు ధర్నా నిర్వహించారు. విద్యుత్ చార్జీలు పెంచబోమని ఎన్నికల్లో ఇచ్చిన హామీకి విరుద్ధంగా సర్దుబాటు పేరుతో ప్రజలపై భారం మోపుతోందన్నారు. ఎన్నికల ముందు స్మార్ట్ మీటర్లు విరగ్గొడతామని ప్రకటనలు గుప్పించిన కూటమి ప్రభుత్వం వాటినే బిగిస్తోందని, ఇది ఎంత వరకు సబబని ప్రశ్నించారు. ప్లకార్డులు, బ్యానర్లతో పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం ఈఈ పోలాకి శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు బి.భారతి, డి. కొండమ్మ, జి.కిరణ్, ఏ.గురుమూర్తి రెడ్డి, జి.మంగశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సెలవుల్లోనూ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

మధురవాడ: ఆర్థిక సంవత్సర ముగింపు సమయంలో కక్షిదారులకు ఇబ్బంది లేకుండా సెలవుల్లోనూ కార్యాలయం పనిచేస్తుందని మధురవాడ సబ్ రిజిస్ట్రార్ చక్రపాణి తెలిపారు. ఉగాది (ఆదివారం), రంజాన్ సెలవులు వరుసగా రావడంతో రెండు రోజులు కార్యాలయం మూతపడే అవకాశం ఉంది. దీంతో ఆ సెలవులను ప్రభుత్వం రద్దు చేసిందని, కార్యాలయం సెలవుల్లోనూ పని చేస్తుందని తెలిపారు. ప్రజలు ఈ సేవలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఉల్లాసంగా యువజనోత్సవాలు



పాటలు పాడుతున్న సినీ నేపథ్య గాయకుడు శ్రీకృష్ణ

తగరపువలస: చెరకుపల్లి అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో అవెన్సిస్–2025 పేరుతో రెండు రోజుల పాటు జరగనున్న జాతీయ యువజనోత్సవాలను అవంతి విద్యాసంస్థల చైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు శుక్రవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న కృష్ణ విశ్వవిద్యాలయం వీసీ కె.రాంజీ మాట్లాడుతూ విద్యార్థులు అవకాశాలు వినియోగించుకుని నైపుణ్యాలు సంపాదించుకోవాలన్నారు. అర్జున అవార్డు గ్రహీత నీలంశెట్టి లక్ష్మి, అజినోమోటో బయో ఫార్మా సర్వీసెస్ ఏజీఎం సీహెచ్ ఆదిత్య కిరణ్, ఐటీ సొల్యూషన్స్ వైస్ ప్రెసిడెంట్ కె.కృష్ణ చైతన్య తదితరులు మాట్లాడారు. సినీ నేపథ్య గాయకులు శ్రీకృష్ణ, ఉమా నేహ విద్యార్థులను ఉర్రూతలూగించే పాటలు పాడారు. అవంతి విద్యాసంస్థల కార్యదర్శి ముత్తంశెట్టి ప్రియాంక, డైరెక్టర్ ఆకుల చంద్రశేఖర్, ప్రిన్సిపాల్స్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు పట్టని కూటమి ప్రభుత్వం



మాట్లాడుతున్న సీపీఐ నాయకులు రాంబాబు, అప్పలరాజు

తగరపువలస: కూటమి ప్రభుత్వం 9 నెలల పాలన పూర్తి చేసుకున్నా ప్రజా సమస్యలు పట్టించుకోవడం లేదని భీమిలి ఏరియా సీపీఐ కార్యదర్శి కానూరి రాంబాబు విమర్శించారు. శుక్రవారం గుజ్జు రాము నాయుడు భవన్‌లో సహాయ కార్యదర్శి మోర అప్పలరాజుతో కలిసి మాట్లాడారు. అర్హులైన పేదలకు ఇళ్ల స్థలాలు, ఇంటి నిర్మాణానికి సాయం, అన్నిరకాల పెన్షన్లు వెంటనే ఇవ్వడం ప్రారంభించాలన్నారు.

మానవాళికి మేలు కలిగేలా పరిశోధనలు



కాన్ఫరెన్స్ సావనీర్ విడుదల చేస్తున్న కృష్ణ విశ్వవిద్యాలయం వీసీ రాంజీ

తగరపువలస: మన పరిశోధనలు మానవజాతికి మేలు జరిగేలా ఉండాలని మచిలీపట్నం కృష్ణ విశ్వవిద్యాలయం ఉప కులపతి కె.రాంజీ అన్నారు. సంగివలస అనిట్స్‌లో మెకానికల్ విభాగం ఆధ్వర్యంలో రెండు రోజుల పాటు జరగనున్న 'మెటీరియల్ డిజైన్ ఇన్నోవేషన్స్ అండ్ ఎనర్జీ సిస్టమ్స్ ఆప్టిమైజేషన్ ఫర్ ఇండస్ట్రియల్ అప్లికేషన్స్' పేరిట మొట్టమొదటి అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌ను శుక్రవారం ఆయన ప్రారంభించారు. ప్రిన్సిపాల్ కె.శ్రీరామకృష్ణ, మెకానికల్ విభాగాధిపతి బి.నాగరాజు ప్రసంగించారు. హైదరాబాద్‌కు చెందిన ఫ్యూయల్ అసెంబ్లీ ప్లాంట్ మేనేజర్ వై.సన్యాసిరాజు, అమెరికాలోని క్రిస్టియన్ బ్రదర్స్ యూనివర్సిటీకి చెందిన కొడాలి దీపక్, మండి ఐఐటీ నుంచి ప్రొఫెసర్ బి.జగదీష్, కో ఆర్డినేటర్లు లెనిన్, వినోద్‌బాబు తదితరులు పాల్గొన్నారు. కాన్ఫరెన్స్ సావనీర్‌ను విడుదల చేశారు.

నూకాలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారి దర్శనానికి నిరీక్షిస్తున్న భక్తులు,



అమ్మవారి పేరు, చిత్రంతో ఏర్పాటుచేసిన గ్యాస్ బెలూన్

భీమునిపట్నం: భీమిలి గ్రామదేవత నూకాలమ్మ వారి ఉత్సవాల్లో భాగంగా భక్తులు శుక్రవారం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ కార్యనిర్వహణాధికారి బొంగరాల మురళీమోహన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు. అంతకు ముందు గురువారం రాత్రి తొలేళ్ల ఉత్సవం సందర్భంగా గంటస్తంభం వేదిక వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున బాణసంచా కాల్చారు. పెద్దబజారు, ఎగువపేట, చిన్నబజారు వేదికల వద్ద ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

దుర్గాలమ్మ సన్నిధిలో ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు



ప్రత్యేక అలంకరణలో దుర్గాలమ్మ వారు



ఉత్సవాలకు ముస్తాబు చేస్తున్న ఆలయం

మధురవాడ: చంద్రంపాలెం జాతర గట్టు దుర్గాలమ్మ వారి ఆలయంలో 30వ తేదీన ఉగాది ఉత్సవాలకు ఏర్పాట్లు చేస్తున్నామని ధర్మకర్త పిళ్లా చంద్రశేఖర్, కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు పిళ్లా సూరిబాబు, నాగోతి తాతారావు తెలిపారు. ఆలయంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఆదివారం తెలుగు నూతన సంవత్సరాదిని పురస్కరించుకుని అమ్మవారికి సుప్రభాత సేవ, నిత్యార్చన, పంచామృతాలు.. సుగంధ ద్రవ్యాలతో అభిషేకం ఉంటాయని తెలిపారు. షడ్రుచుల ఉగాది పచ్చడి పంపిణీ, పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశామని, భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. సమావేశంలో పలువురు కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

హాస్టల్ విద్యార్థులు సోదర భావంతో మెలగాలి

పీఎం పాలెం: వేర్వేరు ప్రాంతాల నుంచి వచ్చి, ఒకే హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థులు సోదరభావంతో మెలగాలని పీఎం పాలెం లా అండ్ ఆర్డర్ ఎస్ఐ భాస్కరరావు సూచించారు. బిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన స్థానిక హాస్టల్ విద్యార్థుల సమావేశంలో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు క్రమశిక్షణతో మెలగాలన్నారు. కళాశాల కరస్పాండెంట్ అండ్ సెక్రటరీ కె.శ్రీలక్ష్మి, ప్రిన్సిపాల్ పూర్ణ సత్యనారాయణ మాట్లాడుతూ విద్యార్థులు పాజిటివ్ ఆలోచనలతో తమ భవిష్యత్‌కు బంగారు బాటలు వేసుకోవాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎస్ఐ భాస్కరరావు